ఆర్‌జియుకెటి ఆధ్వర్యాన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ సర్వీస్ స్కీం ప్రత్యేక శిబిరం ఆరో రోజు గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా యూనిట్ వారీగా విజయవంతంగా కొనసాగింది. బోరవంచ గ్రామంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిర కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి.వి.లక్ష్మణరావు, పి.జి. బి.లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం స్థానిక రైతులతో పరస్పర చర్చా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పంటల నిర్వహణ, వ్యవసాయంలో డిజిటల్ సాంకేతికత ప్రాధాన్యత వంటి అంశాలపై చర్చించారు. రైతులు తమ అనుభవాలు, సమస్యలను విద్యార్థులతో పంచుకోవడంతో సమావేశం సార్థకంగా సాగింది. అనంతరం డిజిటల్ సాక్షరత, వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

రుణాల కోసం నిరీక్షణ..!

ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాలపై తొండాట
ఏడాదిన్నర గడిచినా ఒక్క రుణమూ ఇవ్వని దుస్థితి
గత ప్రభుత్వం రుణాలు ఇవ్వకపోవడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు
దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి అర్ధాంతరంగా మధ్యలో నిలిపివేత
బిసి, కాపు కార్పొరేషన్ రుణాలకు రెండు జిల్లాల్లో 40 వేల దరఖాస్తులు
ఎస్‌సి కార్పొరేషన్ రుణాల దరఖాస్తులు రెండు వేలు పైనే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన కూటమి ఇప్పుడు అదేబాటలో నడుస్తోంది. కూటమి సర్కార్ వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకూ కార్పొరేషన్ రుణాలు ఒక్కటీ ఇవ్వకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి మధ్యలో అర్ధాంతరంగా నిలిపివేసిన ప్రభుత్వం.. మళ్లీ ఆ ఊసే మరిచిపోయింది. దీంతో వైసిపి ప్రభుత్వ బాటలోనే కూటమి సర్కార్ నడుస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాలపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. కార్పొరేషన్ రుణాలు మంజూరైతే ఉపాధి దొరుకుతుందని ఆశించిన ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ నిరుద్యోగ యువతకు తీవ్ర నిరాశే మిగిలింది. 2025 మార్చిలో బిసి, కాపు కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో బిసి కార్పొరేషన్ కింద 3,600 యూనిట్లు, కాపు కార్పొరేషన్ కింద 1,387 యూనిట్లు, ఇడబ్ల్యుఎస్ కోటా కింద 215 యూనిట్లు మంజూరుకు ఆదేశాలు జారీ అయ్యాయి. మార్చి పదో తేదీ నుంచి 20వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ సైతం జరిగింది. ఏలూరు జిల్లాలో 20 వేలకుపైగా, పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేలు మొత్తం 40 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దరఖాస్తుదారులకు మండల పరిషత్ అధికారులు ఇంటర్వ్యూలు సైతం నిర్వహించారు. దీంతో ఇక కార్పొరేషన్ రుణం వచ్చేసినట్లేనని అంతా భావించారు. అదే సమయంలో ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. మే పదో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. రెండు వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. తర్వాత ఏం జరిగిందో, ఏమో తెలీదుగాని ఒక్కసారిగా కార్పొరేషన్ రుణాల ప్రక్రియను అర్ధాంతరంగా నిలిపివేశారు. ఎందుకు నిలిపివేశారో కారణాలు సైతం చెప్పలేదు. మరో మూడు నెలలు గడిస్తే దరఖాస్తుల స్వీకరణ జరిగి ఏడాది గడిచిపోతుంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకుండాపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలు ఇస్తుందా, లేదా అనే చర్చ జనాల్లో సాగుతోంది.

వైసిపి ఏం చేసిందో.. కూటమి అదే చేస్తోందా..!

గత వైసిపి పాలనలో ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాలను పూర్తిగా పక్కన పెట్టేసింది. ఎస్‌సిలు, బిసిలకు ఇచ్చిన పెన్షన్లు, అమ్మఒడి ఇతర పథకాల సొమ్ము లెక్క చెప్పి ఆయా సామాజిక తరగతులకు పెద్దఎత్తున మేలు చేశామని మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేసింది. కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని ఆయా సామాజిక తరగతుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే కార్పొరేషన్ రుణాలు పెద్దఎత్తున ఇస్తామని హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే ప్రభుత్వం వచ్చిన కొద్ది నెలలకే కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానించడంతో అంతా సంతోషం వ్యక్తం చేశారు. మధ్యలో ప్రక్రియను నిలిపివేసి వైసిపి ఏవిధంగా కార్పొరేషన్ రుణాలకు ఎగనామం పెట్టిందో.. కూటమి సర్కార్ అదేవిధంగా ముందుకు సాగుతోంది. ఎస్‌సి, బిసి కార్పొరేషన్ రుణాల ప్రక్రియను ప్రారంభించి వెంటనే రుణాలు మంజూరు చేయాలని ఆయా సామాజిక తరగతుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది. వైసిపి తరహాలో మోసగించాలని చూస్తే వైసిపికి పట్టిన గతే 2029 ఎన్నికల్లో కూటమి సర్కార్‌కు తప్పదని హెచ్చరిస్తున్నారు. కార్పొరేషన్ రుణాలు మంజూరైతే ఎంతోమందికి ఉపాధి దొరుకుతుంది. 20 లక్షల ఉద్యోగాలిస్తామని ఊదరగొడుతున్న ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలను ఎందుకు నిలిపివేసిందో సమాధానం చెప్పాలని అంతా కోరుతున్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కలిసి కృషి చేయాలి

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఎల్‌ఎ చంటి

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నిర్దేశిత లక్ష్యాలను సాధించి ఏలూరు జిల్లాను రాష్ట్రంలో ముందువరుసలో ఉంచేలా పనిచేద్దామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ్, జిల్లా అటవీ శాఖాధికారి పి.వి.సందీప్ రెడ్డి, నూజివీడు సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా ప్రజాప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేసి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుదామన్నారు. పేద సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యత అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. కలెక్టర్‌ను ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, ఎం.వి.రమణ, కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్, ఎపి ఐఐడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా, ఎపి ఎంఐపి అధికారి ఎస్.రామ్మోహన్, నగరపాలక కమిషనర్ ఎ.భానుప్రతాప్, తదితర అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాను ప్రమాద రహితంగా రూపొందించాలి

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించిన కలెక్టర్ వెట్రిసెల్వి

జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా రూపొందించేందుకు ప్రతి ఒక్కరికీ రహదారి భద్రతపై అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలపై ముద్రించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రోడ్డు ప్రమాదాల ద్వారా ఏటా వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఎందరో క్షతగాత్రులవుతున్నారని తెలిపారు. ఎన్నో కుటుంబాలు ఛిద్రమవుతున్నాయన్నారు. రహదారి నియమాలపై సరైన అవగాహన లేకపోవడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, అతివేగం మద్యం సేవించి వాహనాలు నడపడం, వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించి సురక్షిత ప్రయాణం చేసేలా ట్రాఫిక్ నియమాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించాలని, ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రవాణా శాఖ ఉప కమిషనర్ కెఎస్ఎంవి.కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను జనవరి, 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అన్ని ప్రాంతాలు, పాఠశాలల్లో రహదారి భద్రత, నిబంధనలపై అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిఒ శేఖర్, ఎంవిఐలు భీమారావు, విఠల్, జగదీశ్, స్వామి, ప్రజ్ఞ, కళ్యాణి పాల్గొన్నారు.

కొనసాగిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల రిలే దీక్షలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

గత ఎనిమిదేళ్ల నుంచి జీతాలు పెంచలేదని, తమకు న్యాయంగా ఇవ్వాల్సిన జీతం విషయంలో సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరుతూ నూజివీడు ట్రిపుల్ ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న నిరసన దీక్ష గురువారానికి 9వ రోజుకు చేరుకుంది. ఆర్‌జియుకెటిలో పని చేస్తున్న వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు మాత్రమే కాకుండా నూజివీడుకు చెందిన వివిధ కార్మిక సంఘాల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. ఆర్‌జియుకెటి రెగ్యులర్ ఉద్యోగుల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల న్యాయమైన డిమాండ్ల విషయంలో ఉన్నతాధికారులు సత్వరమే నిర్ణయం తీసుకోవాలని శిబిరాన్ని సందర్శించిన నాయకులు పేర్కొన్నారు. మొత్తంగా 9వ రోజుకు చేరుకున్న నిరసన దీక్షలో భాగంగా రిలే దీక్ష రెండో రోజుకు చేరుకుంది. డాక్టర్ పివి.లక్ష్మణరావు, సుధీర్ కుమార్ రిలే దీక్ష చేశారు. ఈ నిరసన దీక్షా శిబిరాన్ని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు సందర్శించి మద్దతు తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్య పరిష్కారానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రకటించారు. మెంటర్లు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. 9 రోజుల నుంచి నిరసన దీక్ష జరుగుతున్నా పట్టించుకోకుండా, సమస్యను పరిష్కరించకుండా అధికారులు అలసత్వాన్ని ప్రదర్శించడం అన్యాయమని అసిస్టెంట్ ప్రొఫెసర్లు వాపోయారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ క్యాంపస్ అంతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సీతాపతి, వేణుగోపాల్, దుర్గాబాబు, వెంకటేశ్వర్లు, చింతయ్య నాయుడు, గణేష్, జడా సుబ్బారావు, విజయశ్రీ, దీప్తి సాహు, సుధీర్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణరావు, వై.శ్రీను, వెర్రియ్య నాయుడు, కృష్ణ, సతీష్, అధ్యాపకులు ర్యాలీలో పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోరాటానికి సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల న్యాయమైన పోరాటానికి సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటనలో మద్దతు తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటి వైస్ ఛాన్సలర్, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. దాదాపు 50 మంది వరకూ ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనం 2018 సంవత్సరం నుండి పెరగలేదని, వారిని పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎనిమిది రోజులుగా వారు తమ డిమాండ్ల సాధనకై నూజివీడులో ట్రిపుల్ ఐటి వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని తెలిపారు. పిల్లల జీవితాలను తీర్చిదిద్దే ప్రొఫెసర్ల జీవితాలని కాపాడే బాధ్యత ఎవరు తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. వెంటనే ఈ సమస్యపై ట్రిపుల్ ఐటి ఉన్నతాధికారులు స్పందించి కమిటీ వేయాలని, వైస్ ఛాన్సలర్, రాష్ట్ర ప్రభుత్వం వారికి వేతనాలను తక్షణం పెంచాలని డిమాండ్ చేశారు. వైస్ ఛాన్సలర్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లతో తక్షణం చర్చలు జరిపి జీతాలు పెంపుదలపై నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో డెస్క్ ఇన్‌ఛార్జి ప్రసాద్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

బుధవారం అర్ధరాత్రి పెనుమంట్ర తహశీల్దార్ కార్యాలయం వద్ద అతివేగంతో వచ్చిన మోటార్ సైక్లిస్టు ఢీకొట్టడంతో ప్రజాశక్తి డెస్కు ఇన్‌ఛార్జి వేంద్ర ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరులో ప్రజాశక్తి కార్యాలయంలో డెస్కు ఇన్‌ఛార్జిగా వేంద్ర ప్రసాద్ పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి కార్యాలయంలో విధులు ముగించుకుని కొత్త ఏడాది నేపథ్యంలో తాడేపల్లిగూడెం నుంచి పిప్పర మీదుగా స్కూటీపై సొంత గ్రామం పోలమూరు వెళ్తున్నారు. పెనుమంట్ర తహశీల్దార్ కార్యాలయం సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న పెనుమంట్రకు చెందిన మోటార్ సైక్లిస్టు జి.వెంకటేష్ వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనంలో ప్రసాద్‌ను, అలాగే స్వల్పంగా గాయపడిన వెంకటేష్‌ను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రసాద్‌కు చేతికి, కాలికి, నుదుటిపై, కంటి కింద బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు తణుకులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు పరిశీలించి కుడి చేతి, కాలి బొటవేలి ఎముకలు విరిగినట్లు గుర్తించి సర్జరీ చేయాలని తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, ప్రతాప్ ఆసుపత్రికి చేరుకుని నిరంతరం వైద్యులతో మాట్లాడుతూ పరిస్థితిని పర్యవేక్షించారు. గాయాలైన డెస్కు ఇన్‌ఛార్జి ప్రసాద్‌ను రాజమండ్రి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల మేనేజర్ పి.నారాయణరాజు, అకౌంటెంట్ నాగభూణం పరామర్శించారు. సిజిఎం అచ్యుతరావు, ఎడిటర్ తులసీదాస్, జిఎంలు తిరుపాలరెడ్డి, తోడర మల్లు ఫోన్లో మాట్లాడి ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

సమస్యల వెలికితీతలో ప్రజాశక్తి కీలకపాత్ర

క్యాలెండర్ ఆవిష్కరణలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రజా సమస్యలను వెలికి తీసి అధికారులకు, నాయకులకు తెలిసే విధంగా వార్తలు రాయడంలో ప్రజాశక్తి ముందుంటుందని పోల వరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడులోని క్యాం పు కార్యాలయంలో ప్రజాశక్తి 2026 క్యాలెండర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వెలికి తీసి అధికారులకు, నాయకులకు తెలిసే విధంగా వార్తలు రాయడంలో ప్రజాశక్తి ముందుంటుందన్నారు. ఎలాంటి వార్తలను అయినా నిర్భయంగా, కచ్చితంగా రాసే వార్తాపత్రిక ప్రజాశక్తి అని అన్నారు. ఈ విధంగా ప్రజలకు అవసరమైన వార్తలను రాస్తుండడం వల్ల నియోజకవర్గంలోని పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరమవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి బుట్టాయగూడెం విలేకరి గంజి మధుబాబు, ఐ న్యూస్ రిపోర్టర్ అందుగుల నానాజీరావు, సూర్య విలేకరి కట్ట మధుసూదన్ బాబు, ప్రజా భూమి విలేకరి నూకల క్రాంతి, నిట్టా రవి, తలారి దాసు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌చే రెవెన్యూ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

బాధ్యతతో విధులు నిర్వహించి ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని జెఎసి ఛైర్మన్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌కుమార్ చెప్పారు. రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అసోసియేషన్ రూపొందించిన డైరీని కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ చేతులమీదగా రెవెన్యూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉద్యోగులు అన్ని రకాల విధులు బాధ్యతతో నిర్వహించి ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తారన్నారు. ప్రభుత్వం కూడా ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల ఆర్థిక, ఇతర బెనిఫిట్స్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమములో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ జి.విజయకుమార్‌రాజు, వైస్ ప్రెసిడెంట్లు కె.చల్లాన్‌దొర, కె.రవిచంద్రరావు, పి.మాధవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం
జిల్లా సాధన సమితి నాయకులు స్పష్టం
మూడో రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు జిల్లా సాధన సమితి చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షలు గురువారం మూడో రోజు నూతన సంవత్సరం రోజు కూడా దీక్షలను కొనసాగించారు. పోలవరం జిల్లా కోసం హామీలు ఇచ్చిన నాయకులు, కూటమి నాయకులు దీక్షలకు మద్దతు పలకకపోవడం అక్షేపనీయమని జిల్లా సాధన సమితి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో త్యాగాలు చేసిన మైదాన ప్రాంత ప్రజలకు, ఏజెన్సీ ముంపు గ్రామాల ప్రజలకు జిల్లా ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం, కూటమి పాలకులు తీరని అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పోలవరం నియోజకవర్గాన్ని పోలవరం జిల్లాలో విలీనం చేయాలని, పోలవరాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి మూడో రోజు దీక్షలో సారిక రాము, వీరపురాజు చిట్టిబాబు, మాట్ల లక్ష్మీమణికంఠస్వామి, తెలగంశెట్టి సుబ్బారావు, దూసనపూడి పోశిబాబు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. సాధన సమితి నాయకులు బుగ్గ మురళీకృష్ణ సొబ్బన మోహన్, జల్లేపల్లి వెంకట నరసింహారావు(జెవి), సొబ్బన రాజశేఖర్‌బాబు, తుమ్మరాడ పోసిబాబు, జె.వేణుగోపాలకృష్ణ, తదితరులు మద్దతుగా ఉన్నారు. పాతపోలవరం, నూతనగూడెం, బెస్తావీధి, రామయ్యపేట, జగన్నాథపేట, బిసి కాలనీ గ్రామస్తులు దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం ప్రకటించారు.

న్యూ ఇయర్ రోజు విషాదం

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు
ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు
మరో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


ప్రమాదంలో ధ్వంసమైన కారు

నూతన సంవత్సరం సందర్భంగా కారు సెల్ఫ్ డ్రైవింగ్‌కు తీసుకుని సరదాగా బయటకు వెళ్తున్న స్నేహితులు ప్రమాదానికి గురయ్యారు. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన జంగారెడ్డిగూడెం మండలంలోని లక్కవరం పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... పంగిడిగూడెం గ్రామానికి చెందిన నలుగురు స్నేహితులు కాక్కుళ్ల స్టాలిన్ (18), కాక్కుళ్ల జస్వంత్, మానుకొండ జస్వంత్, మాండ్రు సాగర్ గురువారం నూతన సంవత్సరం సందర్భంగా జంగారెడ్డిగూడెంలో ఓ కారును సెల్ఫ్ డ్రైవింగ్‌కు తీసుకున్నారు. ఈ క్రమంలో వారు పంగిడిగూడెం వచ్చి అక్కడి నుంచి లక్కవరం వైపు వెళుతుండగా లక్కవరం గ్రామ పరిధిలోకి వచ్చేసరికి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాక్కుళ్ల స్టాలిన్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ముగ్గురు గాయాలపాలయ్యారు. ఇది గమనించిన అక్కడ పొలం పనులు చేసుకుంటున్న కూలీలు వారిని హుటాహుటిన లక్కవరం ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న లక్కవరం ఎస్ఐ జబీర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్టాలిన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

శోకసంద్రంలో కుటుంబం

మృతుని తల్లిదండ్రులు నాగరాజు, మార్త కూలి పనులు చేసుకుంటూ కుమారుడిని పదో తరగతి వరకు చదవించారు. అనంతరం స్టాలిన్ చదువు మానేసి పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కుటుంబానికి అండగా ఉన్న స్టాలిన్ మృతితో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. స్టాలిన్‌కు ఒక అక్క ఉంది. ఈ ఘటనతో పంగిడిగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మండలంలోని వేగవరం గ్రామ పరిధిలో జాతీయ రహదారిపై చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్‌కు చెందిన అమరారాం చౌదరి (24) జంగారెడ్డిగూడెంలో ఉంటూ అక్కడే ఓ ఫ్యాన్సీ స్టోర్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం బైక్‌పై అశ్వారావుపేట వెళ్లి తిరిగి జంగారెడ్డిగూడెం బయలుదేరాడు. వేగవరం గ్రామ పరిధిలోకి వచ్చేసరికి ముందు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి సైకిల్‌ను పక్కకు తిప్పాడు. దీంతో చౌదరి ఆ సైకిల్ ఢీకొట్టడంతో సైకిల్‌పై ఉన్న వ్యక్తి పక్కకు పడిపోయాడు. బైక్‌పై ఉన్న చౌదరి రోడ్డుపై పడడంతో అదే సమయంలో వచ్చిన కెఆర్.పురం డిప్యూటీ డైరెక్టర్‌కు సంబంధించిన కారు అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం సిఐ ఎంబి.సుభాష్, ఎస్ఐ వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ కుటుంబరావు తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసి, ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అమరారాం చౌదరి (ఫైల్)

ప్రాణసంకటంగా వాటర్ ట్యాంకు

శిథిలావస్థకు చేరిన వైనం

హైస్కూల్ పక్కనే ఉండడంతో భయాందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగర పరిధిలోని సత్రంపాడులో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణకు ఆనుకుని ఉన్న రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకు శిథిలావస్థకు చేరి స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ట్యాంకు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, ఏ క్షణం కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. భయానక స్థితిలో ట్యాంకుపై పిచ్చిమొక్కలు మొలిచి మంచినీటి ట్యాంకు నిర్వహణ లేక కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంది. మరీ ముఖ్యంగా ట్యాంకును మోస్తున్న నాలుగు పిల్లర్లు (స్తంభాలు) పూర్తిగా దెబ్బతిన్నాయి. సిమెంట్ పెచ్చులు ఊడిపోయి లోపల ఉన్న ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో ట్యాంకు ఏ వైపు ఒరుగుతుందో తెలియని ప్రమాదకర స్థితి నెలకొంది. ఈ ట్యాంకు సరిగ్గా జిల్లా పరిషత్ హైస్కూల్ పక్కనే ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు ఈ దారి గుండానే పాఠశాలకు రాకపోకలు సాగిస్తుంటారు. విరామ సమయంలో విద్యార్థులు ఆ ప్రాంతంలోనే ఆడుకుంటూ ఉంటారు. పాఠశాలకు అతి సమీపంలో ఈ మృత్యుకూపం ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ఈ ట్యాంకును త్వరలోనే తొలగిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఏళ్లు గడుస్తున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప ఆచరణలో ట్యాంకును కూల్చే ప్రయత్నం చేయడం లేదని వారు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. భవిష్యత్తులో ఏదైనా పెను ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించక ముందే జిల్లా యంత్రాంగం, మున్సిపల్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన ఈ పాత ట్యాంకును కూల్చివేసి, విద్యార్థులు, స్థానికుల రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన వాటర్‌ట్యాంకు

యువకుడిపై దాడి అమానుషం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రేమవివాహం చేసుకుని నివాసం ఉంటున్న యువకుడిపై యువతి బంధువులు దాడి చేయడం అమానుషమని సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాసరావు అన్నారు. రమణక్కపేట సిపిఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంపై చర్యలు తీసుకుని బాధితుడికి సరైన న్యాయం జరిగే విధంగా చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కంచర్ల దుర్గారావు, కంచర్ల రమేష్, శ్రీను, నక్క శ్రీను, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాషా ఆవిష్కరించారు. గురువారం వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం క్యాలెండర్-2023 ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాషా మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై నిత్యం కృషి చేస్తూ వ్యవసాయంలో మెలకువలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం చేయడం అభినందనీయమన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రైతులు సంఘటితం కావాలని కోరారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధరలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం రావాలన్నారు. వ్యవసాయ శాఖ, వ్యవసాయ అనుబంధ శాఖలు ద్వారా రైతులకు మేలు జరిగేలా మరిన్ని చర్యలు చేపట్టాలని కోరారు. చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాల పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. కోకో, కొబ్బరి తదితర పంటలు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జిల్లా సహకార అధికారి ఆదిమిల్లి శ్రీనివాస్, ఏపి ఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.రామ్మోహన్‌రావు, జిల్లా ఉద్యాన అధికారి షాజా నాయక్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శివ శ్రీరామమూర్తి, ఇరిగేషన్, పట్టు శాఖ ఉన్నతాధికారులకు రైతు సంఘం క్యాలెండర్లను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కోనే శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, నాయకులు గండి రాజా, ఎస్.అప్పారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు గోధుమపిండి పంపిణీ

ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి - భీమడోలు

రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న రేషన్ దుకాణాల ద్వారా గోధుమపిండి విక్రయాన్ని భీమడోలులో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించి లబ్ధిదారులకు గోధుమపిండి ప్యాకెట్లు అందజేశారు. 49 రేషన్ దుకాణాల పరిధిలోని 33,363 మంది కార్డుదారులకు ఈ నెలలో బియ్యం, పంచదారతోపాటు నాణ్యమైన గోధుమ పిండి అందజేయనున్నట్లు తెలిపారు. జెసి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి నుంచి ప్రయోగాత్మకంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నాణ్యమైన గోధుమపిండిని కేజీ 20 రూపాయలకే అందించాలని భావించిందన్నారు. భీమడోలు పట్టణంలోని 33 వేల మంది కార్డుదారులు నాణ్యమైన గోధుమపిండిని పొందాలని కోరారు. జిల్లా సివిల్ సప్లై అధికారి సరోజ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కోయిదా నిర్వాసిత కాలనీతో పాటు దర్భగూడెం స్వర్ణవారిగూడెం గ్రామ శివార్లలో గురువారం కోడిపందేల శిబిరాలపై దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కోయిదా నిర్వాసిత కాలనీతో పాటు దర్భగూడెం, స్వర్ణవారిగూడెం గ్రామ శివార్లలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో 14 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7480 నగదు, మూడు కోళ్లు, మూడు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. వారందరినీ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శింగరాయపాలెంలో...

టి.నరసాపురం : కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వల్లంపట్ల పంచాయతీలోని శింగరాయపాలెంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1080 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రైతులకు అందుబాటులో లేని గోదాములు

పలుచోట్ల పూర్తి కాని నిర్మాణ పనులు

కొన్నిచోట్ల పూర్తయినా వినియోగంలోకి రాని వైనం

నిరుపయోగంగా ఉన్న గోదాము

ప్రజాశక్తి - ముసునూరు

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట నిల్వలు చేసుకుని, రైతుకు నాణ్యమైన ధర వచ్చినప్పుడు అమ్ముకునేందుకు గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టింది. రైతులు పండించిన పంటల ఉత్పత్తులను నిల్వలు చేసుకునేందుకు (గిడ్డంగులు) గోదాముల నిర్మాణానికి గత ప్రభుత్వంలోనే నిధులు కేటాయించారు. కొన్ని గ్రామాల్లో స్థలాలు లేక నిర్మాణం జరగలేదు. కొన్ని గ్రామాల్లో కట్టడాలు అసంపూర్ణంగా నిలిచిపోయాయి. దీంతో ఈ గోదాముల నిర్మాణం కోసం తీసుకున్న రుణాలకు వడ్డీ భారం పెరుగుతుందే తప్ప ఉపయోగం లేదు. ఈ భవనాల సముదాయం కొందరికి అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా తయారయ్యాయని గ్రామస్తులు వాపోతున్నారు. పలుచోట్ల ఈ భవనాల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. కొన్నిచోట్ల అసంపూర్ణంగా వదిలేశారు. మరికొన్నిచోట్ల నిర్మాణం పూర్తయినా అందుబాటులోకి తీసుకురాలేదు. మండలంలో వరి, మొక్కజొన్న, పొగాకు, పత్తి, మిర్చి వంటి పంటలు ఎన్నో పెట్టుబడులు పెట్టి పండించి అమ్ముకునేందుకు రైతులు ఎన్నో కష్టాలు పడుతున్నారు. చివరికి రైతులు దళారులు చెంతకు చేరి వారు అడిగిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుంది. అదే గిడ్డంగులు ఉంటే రేట్లు ఉన్నప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి, వాటి నిర్మాణం చేపట్టాలని, నిర్మాణం పూర్తయినవాటిని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు, ఉన్నత స్థాయి అధికారులు స్పందించి మండల స్థాయిలో కనీసం పెద్ద, పెద్ద గ్రామాల్లోనైనా గిడ్డంగులు నిర్మించాలని కోరుతున్నారు.

అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు

ప్రజాప్రతినిధులకు, అధికారులకు, నాయకులకు పలువురి శుభాకాంక్షలు

ఏలూరులో..

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌కు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ మండలాల ఎంపిడిఒలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు నూతన సంవత్సరంలో చైర్‌పర్సన్ నాయకత్వంలో జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలవ్వాలని ఆకాంక్షించారు. అందరి సహకారంతో జిల్లా అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చైర్‌పర్సన్ తెలిపారు.


జీలుగుమిల్లిలో..

ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆర్‌టిసి ఉన్నతాధికారులు, వివిధ సంఘాల నాయకులు, ఎన్‌డిఎ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ 2026 నూతన సంవత్సరం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ఏలూరు నియోజకవర్గ ప్రజలకు, జనసేన, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. 2026లో రాష్ట్రంలో ఉద్యోగ కల్పన, మౌలిక వసతులు, పరిశ్రమల అభివృద్ధి మరింత వేగవంతం కావాలని, ప్రజలందరికీ మంచి పరిపాలన అందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, యూనియన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో గతేడాది బంపర్ హిట్‌గా నిలిచిందని, కొత్త ఏడాదిలో ప్రజాహిత ప్రణాళికాయుత పాలనతో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని టిడిపి జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. న్యూ ఇయర్ సందర్భంగా పవర్‌పేటలోని ఆయన క్యాంపు కార్యాలయం సంబరాలతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటిని ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నగర మేయర్ షేక్ నూర్జహాన్ దుశ్శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ఉద్యోగ, కుల సంఘాల నేతలు న్యూ ఇయర్ క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ తన గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. 2025 కూటమి ప్రభుత్వానికి గోల్డెన్ ఇయర్‌గా నిలిచిందని, 2026లో అంతకుమించిన విజయాలు సాధించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

నూతన సంవత్సరం సందర్భంగా ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్-ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులకు అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మేయర్ దంపతులు ఉదయం పవర్‌పేటలోని వాసు దేవ, శివాలయాలను సందర్శించారు. అనంతరం ఏలూరు ఎంఎల్ఎ, టిడిపి జిల్లా అధ్యక్షులు బడేటి ఎంఎల్ఎను, కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పవర్‌పేట మేయర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు, కార్పొరేటర్లు, వ్యాపార, విద్యాసంస్థల ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, మేయర్ కుటుంబ సభ్యులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన వారికి మేయర్ దంపతులు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

ముదినేపల్లి : ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. తన కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త ఏడాది అందరికీ శుభం కలగాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే ప్రతిఒక్కరి కుటుంబంలో సుఖసంతోషాలు నింపాలని అందరూ బాగుండాలని కోరారు. అనంతరం యుటిఎఫ్ నూతన క్యాలెండర్, డైరీని ఎంపిపి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు కార్యకర్తలు, ఎంపిపి అభిమానులు, తదితరులు పాల్గొని సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు.

వంద మందికి నూతన వస్త్రాలు బహూకరణ

ముదినేపల్లి : వివేక్ ఫౌండేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఎస్.ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సరం పురస్కరించుకుని వందమందికి నూతన వస్త్రాలు బహుకరించారు. మండలంలోని అల్లూరు గ్రామంలోని సజీవ సిలువ ప్రార్థన మందిరం పాస్టర్ టి.లాజరస్‌బాబు ప్రార్థన మందిరంలో వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం వందమందికి నూతన వస్త్రాలను టిడిపి గ్రామ నాయకులు దావు నాగరాజు చేతులమీదుగా అందించారు.

వినోద్‌కు వెల్లువెత్తున శుభాకాంక్షలు

నూతన సంవత్సరం సందర్భంగా టిడిపి కైకలూరు నియోజకవర్గ కో కన్వీనర్ కొడాలి వినోద్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నియోజవర్గంలోని పలు గ్రామాల ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వినోద్ అభిమానులు కొడాలి వినోద్‌ను మండలంలోని చిగురుకోటలో ఆయన స్వగృహానికి విచ్చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పోలవరంలో...

క్రైస్తవ సోదరులు గురువారం నూతన సంవత్సర వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవులు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎల్ఇఎఫ్, పెనుయేలు ప్రార్థనా మందిరం, క్రీస్తు సంఘం, ఆర్‌సిఎం, సిబి సిఎన్‌సి, సిఎస్ఐ, పెంతుకోస్తు తదితర ప్రార్థన మందిరాల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో చర్చిలకు పిల్లలు, పెద్దలు, విశ్వాసులు, యువతి, యువకులు, పెద్ద సంఖ్యలో ప్రార్థన మందిరానికి రావడంతో చర్చిలన్నీ కిటకిటలాడాయి. సందర్భంగా క్రైస్తవులు ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ముసునూరు : మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని 16 గ్రామాల్లో ఆయా గ్రామస్తులు, అధికారులు, నాయకులు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కొండేటి బాబి, టిడిపి నాయకులు మెదరమెట్ల సురేంద్ర, గార్లపాటి నరసింహారావు, తోట శ్రీను, పులి బళ్ల లక్ష్మీసత్యనారాయణ, గద్దల సుహాసిని మోహన్‌రావు, సూర్యదేవర నాగ మంజుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

టి.నరసాపురం : మండలంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి ప్రారంభమైన వేడుకల్లో క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పల్లెల్లో ఇళ్ల వద్ద నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ రంగవల్లులు వేసి అలంకరించారు. ప్రధానంగా మండలంలోని అప్పలరాజుగూడెం, మక్కినవారిగూడెం, మర్రిగూడెం, పుట్రేపు, ప్రకాష్‌నగర్, గండిగూడెం, సీతంపేట, టి.నరసాపురం, బొర్రంపాలెం తదితర గ్రామాల్లోని ప్రార్థనాలయాల్లో తోటి వారికి స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రజలందరి క్షేమం కోసం పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు ప్రార్థనలు చేశారు. పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు, సహపంక్తి భోజనాలు నిర్వహించారు. నా యకులు, అధికారులు ప్రజా ప్రతినిధులకు పూల బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో జి. జ్ఞాన్ రాజు, కె. నిరిక్షనరావు, సిహెచ్ హెూషేయ, వై. పాల్ చిన్నారావు, రమేష్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు సహకరించాలి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి : పోలవరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, అందుకు అధికారులు సహకరించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బర్రింకలపాడులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు ఆయనకు పుష్ప గుచ్ఛాలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గడిచిన సంవత్సర కాలంలో అన్ని శాఖల అధికారుల సమన్వయ కృషితో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశామని, అదేవిధంగా ఈ నూతన సంవత్సరంలో కూడా మరిన్ని నిధులు తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. దానికి నియోజకవర్గ పరిధిలోని అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు.

చింతలపూడి : నూతన సంవత్సరం సందర్భంగా చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌ను పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఆయనను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని అనేక మంది కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, అభిమానులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శాంతి తీసుకురావాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత కృషి చేస్తానని తెలిపారు.

పోలవరం : నూతన సంవత్సరంలో కూటమి ప్రభుత్వం నూతన ఉత్సాహంతో పేదల కోసం పని చేస్తుందని ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మండలంలోని చేగొండపల్లి ఎపి స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కొయ్యలగూడెం మండలాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తరలివచ్చి జగదీశ్వరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భుక్యా విజయ్ నాయక్, కొవ్వాసు శ్రీను, కొవ్వాసు బొజ్జిదొర తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం : మండలంలోని అశోక్‌నగర్‌లో నివసిస్తున్న కొత్తపల్లి సుబ్బలక్ష్మి అభిమానం, ప్రేమ, ఆప్యాయతలకు అంగవైకల్యం ఎలాంటి అడ్డంకి కాదని మరోసారి నిరూపించారు. తనకు సొంత నివాసం లేకపోవడంతో పాటు అంగవైకల్యం ఉన్నప్పటికీ పెన్షన్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని సుబ్బలక్ష్మి రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి దృష్టికి తీసుకొచ్చారు. మేఘలాదేవి సంబంధిత ఎంఎల్ఎతో మాట్లాడి సుబ్బలక్ష్మికి గృహం, పెన్షన్ మంజూరయ్యేలా కీలక పాత్ర పోషించారు. మేఘలాదేవి చేసిన ఈ సహాయానికి కృతజ్ఞతగా, ప్రతి సంవత్సరం ఎక్కడున్నా, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా ఆమెను కలవడానికి సుబ్బలక్ష్మి ప్రయత్నిస్తూనే ఉంటారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నడవలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ ఆటోలో వచ్చి మేఘలాదేవిని కలిసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఓరిజినల్ డాక్యుమెంట్ పోయినది

ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, కాట్రేనిపాడు గ్రామానికి చెందిన అక్కినేని శ్రీనివాసరావు, భార్య అక్కినేని సులోచన కు చెందిన సర్వేనెంబరు. 127/3లో య.0-50 సెంట్లు భూమికి చెందిన 2799-2003 గల ఓరిజినల్ డాక్యుమెంట్ కాట్రేనిపాడు గ్రామంలో ది.20-11-2025 జిరాక్స్ నిమిత్తం వస్తుండగా మార్గమధ్యంలో జారిపోయినది. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు అందచేయగలరు లేదా తెలియజేయగలరు.

అక్కినేని సులోచన, భర్త శ్రీనివాసరావు
కాట్రేనిపాడు గ్రామం, ముసునూరు మండలం,
ఫోన్: 8374271744

లింకు దస్తావేజులు పడిపోయినవి

మాకు ఆస్తికి సంబంధించి డ్యాకుమెంట్ నెంబర్ 396/2020 ఏలూరు ఆర్వో నందు ది.13-01-2020 నాడు రిజిష్టర్ కాబడి ఉన్నది. సదరు డ్యాకుమెంట్ కు సంబంధించిన ఏలూరు ఆర్వో నందు రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ లింకు డ్యాకుమెంట్లు 1824/1999, 5403/2018, 9507/2018, 11505/2018 ది.24-12-2025 తేదిన మా నివాసం నుండి సదరు ఒరిజినల్ లింకు డ్యాకుమెంట్లను తీసుకుని గాలాయగూడెం వెళ్లాను. అక్కడ పని ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా సోమవరప్పాడు వద్దకు వచ్చే సరికి సదరు ఒరిజినల్ డ్యాకుమెంట్లు ఉన్న కవరు కనిపించలేదు. వెనక్కి వెళ్లి చూడగా ఆ కాగితాలు ఉన్న కవరు కనిపించలేదు. కావున ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్‌తో ఉన్న కవరు దొరికిన వారు ఈ కింది అడ్రస్‌కు అందజేయగలరని కోరుతున్నాను.

చెన్నూరి విజయలక్ష్మీ భర్త అట్రగడ్డ శ్రీరామ్,
డోర్ నెం 16-645, హనుమాన్ నగర్,
ఏలూరు సెల్ :- 9704205686.

వ్యకాస క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం 2026 క్యాలెండర్‌ను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు, రైతులు పేదలందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. 2026 సంవత్సరంలో ప్రజలందరికీ మేలు జరగాలని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు, పేదలు, బడుగు బలహీన తరగతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందని, వారికి అండగా వ్యవసాయ కార్మిక సంఘం ఉంటుందని తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యలు పనిచేస్తూ వారి హక్కుల కోసం వారి సమస్యలను గుర్తించి సమస్యల ఆధారంగా ముద్రించిన 2026 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తూ సంఘం జిల్లా కమిటీని అభినందించారు. పేదల సమస్యలను ప్రభుత్వాలు అధికారులు తీసుకురావడంలో సంఘం మంచి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.మహంకాళిరావు, ఎం.జీవరత్నం, పి.పెద్దిరాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం పట్టణం, స్టీమర్ రోడ్, రాజగోపాలస్వామి దేవాలయం, డోర్‌నెం.1-1-9కి చెందిన కుచిబొట్ల విజయలక్ష్మి, W/o.కొప్పర్తి భాస్కరనారాయణ అను నేను 1-12-2025 తేదీన నా ఒరిజినల్ మెడికల్ కౌన్సిల్ సర్టిఫికెట్ No.AMC 5016 Dt.03-12-2020 Valid upto 2-12-2025 నెంబరు గల ఒరిజినల్ సర్టిఫికెట్ ఉన్న బ్యాగ్‌ను విజయవాడ వెళ్తుండగా నరసాపురం మండలంలో సీతారామపురంలో ఉన్న శివాలయము దగ్గర నా యొక్క కారులో పెట్టి దేవుని దర్శనము నిమిత్తం వెళ్లి తిరిగి వచ్చిచూడగా సర్టిఫికెట్ ఉన్న బ్యాగ్ పోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

కుచిబొట్ల విజయలక్ష్మి, W/o కొప్పర్తి భాస్కర నారాయణ, డోర్‌నెం.1-1-9, స్టీమర్ రోడ్, రాజగోపాల స్వామి దేవాలయం, నరసాపురం, ప.గో.జిల్లా.

సర్టిఫికెట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం పట్టణం, స్టీమర్ రోడ్, రాజగోపాల స్వామి దేవాలయం, డోర్‌నెం.1-1-9కి చెందిన కొప్పర్తి భాస్కరనారాయణ, S/o కొప్పర్తి క్రిష్ణయ్య, (లేటు) అను నేను 1-12-2025 తేదీన నా ఒరిజినల్ మెడికల్ కౌన్సిల్ సర్టిఫికెట్ No.AMC 3389 01-05-12-2020 Valid upto 4-12-2025 నెంబరు గల ఒరిజినల్ సర్టిఫికెట్ ఉన్న బ్యాగ్‌ను విజయవాడ వెళ్తుండగా నరసాపురం మండలంలో సీతారామపురంలో ఉన్న శివాలయము దగ్గర నా యొక్క కారులో పెట్టి దేవుని దర్శనము నిమిత్తం వెళ్లి తిరిగి వచ్చిచూడగా సర్టిఫికెట్ ఉన్న బ్యాగ్ పోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

కొప్పర్తి భాస్కర నారాయణ, S/o కొప్పర్తి క్రిష్ణయ్య (లేటు), డోర్‌నెం.1-1-9, రాజగోపాలస్వామి దేవాలయం, నరసాపురం, ప.గో.జిల్లా.

డాక్యుమెంట్స్ పోయినవి

పాలకొల్లు మండలం ఉల్లంపర్రు, పార్వతి నగర్‌కు చెందిన పీతాని మోహన్ రావు, తండ్రి: నాగభూషణరావు తెలియజేయునది ఏమనగా 2020 సంవత్సరంలో పాలకొల్లు నివాసి వెలమ గూడెం కు చెందిన కానూరి శ్రీనివాసరావు కుమారుడు సాయి కుమార్ దగ్గర ఆర్ఎస్ నెంబర్ 210, మున్సిపల్ అసెస్మెంట్ నెంబర్ 1079006246 లో 36.100 చ.గజాలు స్థలం 4.55 లక్షల రూపాయలకు కొనుగోలు చేసి పాలకొల్లు ఎస్ఆర్ఓ లో 19-3-2020 రిజిస్టర్ చేయించుకున్నాము. అగ్రిమెంట్ నెంబర్ 1773/2020లో రిజిస్ట్రేషన్ చేయుంచుకున్నాము. లింక్ డాక్యుమెంట్ నెంబర్ 2033/2019 ని ది. 12-04-2019న పాలకొల్లు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయుంచుకున్నాము. ది 30-11-2025 న నా ఒరిజినల్ 2 డాక్యుమెంట్స్ తీసుకొని జిరాక్స్ తీయించుకోవడానికి పార్వతి నగర్ నుండి పాలకొల్లు సెంట్రల్‌కు బయల్దేరగా అక్కడ నా ఒరిజినల్ డాక్యుమెంట్లు కనిపించలేదు దారిలో ఎంత వెతికినా ఎక్కడా కనిపించలేదు. కాబట్టి ఎవరికైనా దొరికినా పై అడ్రస్‌లో నాకు అందజేయవలసిందిగా కోరి ప్రార్థించుచున్నాను.

సెల్ నెం : 98487 22327

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS, AT ELURU
A.A.C.F. No. 153/2024

Between:-
SRMB KUBHERA CHITS PVT. LTD.
Represented by its Foreman.
Jangareddigudem. ..... Disputant
And
Gubbala Nageswara Rao & Others
.... Opponents

Notice to Opponents 1,2,3 & 4

1. Gubbala Nageswara Rao, W/o. Narasimhamurthy, R/o. D. No. 13-1-4, Opp. Ramalayam, Buttaigudem Road, Jangreddigudem, Eluru District. (Opponent No. 1)

2. Gubbala Chandra, W/o. Gubbala Nageswara Rao, R/o.D.No. 13-1-4, Opp. Ramalayam, Buttaigudem Road, Jangreddigudem, Eluru District. (Opponent No. 2)

3. Jampani Yedukondalu, S/o. Somaraju, R/o. D. No. 4-58,Gowda Bazar, Kamavarapukota Kamavarapukota(M), Eluru District (Opponent No. 3)

4. Dousuri Veerabhadram, S/o. Veeraswamy, R/o. Chinnavarigudem, Ayyavaripolavarm, Eluru District (Opponent No. 4)

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honorable Deputy Chit Registrar ordered notice to all of you and posted the case to 23-01-2026 for your appearance. So all of you are here by requested to appear before the office of Honorable Deputy Registrar of Chits, District Registrar Office, Eluru on 23-01-2026 at 10-30 A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Honorable Deputy Registrar of Chits)

Hearing Date: 23-01-2026

NVBL Achary, Advocate
Jangareddigudem